# వేంసూరులో నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు"

## ఏడుగురు అరెస్ట్.. 59 నకిలీ రూ.500 నోట్లు, ఏడు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం"



సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు 01 (తెలుగుగళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ రూ.500 నోట్లను అసలైనవిగా చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 59 నకిలీ రూ.500 నోట్లు, ఏడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ నెల 21న కందుకూరు గ్రామానికి చెందిన ఓ కిరాణా వ్యాపారిని మోసం చేసిన నిందితులు రూ.18 వేల నగదు ఇచ్చి, అదే మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. అనంతరం ఆ నగదులో 18 నకిలీ రూ.500 నోట్లు ఉన్నట్లు బ్యాంకు అధికారులు గుర్తించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో దర్యాప్తు చేపట్టి జూలై 30న ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే నేరంగా నకిలీ కరెన్సీ చలామణిని పరిగణించిన ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి సహాయ పోలీసు కమిషనర్ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ చేపట్టారు.

విచారణలో కామవరపు కోటకు చెందిన లారీ డ్రైవర్ మారం రమేష్, అతని సోదరుడు మారం మహేష్, ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన సార్నాల రవీంద్ర ఆర్థిక ఇబ్బందుల కారణంగా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన దాసరి ప్రమోద్, మిరియాల చెందును సంప్రదించినట్లు తేలింది. వీరి ద్వారా చింతలపూడి మండలం ఊటసముద్రానికి చెందిన జుజ్జవరపు రవి పరిచయమయ్యాడు.

జుజ్జవరపు రవి మారం రమేష్, రవీంద్రల నుంచి రూ.1 లక్ష అసలు నోట్లను తీసుకుని వాటికి బదులుగా రూ.2.10 లక్షల విలువైన నకిలీ రూ.500 నోట్లు అందజేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం సత్తుపల్లి, వేంసూరు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో అసలు నోట్లతో కలిపి నకిలీ నోట్లను చలామణి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఈ క్రమంలో మారం రమేష్ కందుకూరు గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి కొప్పుల నాగిరెడ్డికి రూ.9 వేల అసలు నోట్లు, రూ.9 వేల నకిలీ నోట్లు ఇవ్వగా, వాటిని బ్యాంకులో జమ చేసే సమయంలో బ్యాంకు అధికారులు నకిలీవని గుర్తించారు. దీంతో బాధితుడు వేంసూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వేంసూరు ఎస్సై కవిత కేసు నమోదు చేయగా, సత్తుపల్లి గ్రామీణ సీఐ ఎం.ఎల్. ముత్తిలింగయ్య దర్యాప్తు చేపట్టి సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఏడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, 59 నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన నిందితుడు జుజ్జవరపు రవి గతంలో మంచిర్యాల జిల్లా లక్షెట్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ కరెన్సీ కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైనప్పటికీ తన ప్రవర్తన మార్చుకోకుండా మళ్లీ ఇదే నేరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

అలాగే కాకినాడకు చెందిన కొవ్వూరి వినోద్ సతీష్ కుమార్ రెడ్డి వద్ద రూ.50 వేల అసలు నోట్లకు బదులుగా రూ.2.10 లక్షల నకిలీ నోట్లు తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. అతను గతంలో హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీ చలామణి కేసులో అరెస్టై జైలుకు వెళ్లినప్పటికీ మళ్లీ ఇదే తరహా కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# యూరియా యాప్‌ను తక్షణమే రద్దు చేయాలి:పిడిశెట్టి రాజు



తెలుగు గళం న్యూస్ సిద్దిపేట కోహెడ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన యూరియా యాప్ విధానం వల్ల రైతులు తీవ్ర సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,దీనిని తక్షణమే రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి పిడిశెట్టి రాజు డిమాండ్ చేశారు.సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో శనివారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులైన రైతులకు స్మార్ట్‌ఫోన్ వాడకం,యాప్ నిర్వహణపై అవగాహన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యాప్‌లో బుక్ చేసుకున్నప్పటికీ దుకాణాల్లో నిల్వలు లేవని చెప్పడం వల్ల రైతులు అడుగడుగునా అవస్థలు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం స్పందించి ఈ యాప్ విధానాన్ని ఎత్తివేయకపోతే రైతుల తరఫున రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లు తక్షణమే స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన టీజీఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్‌కు ఘన సన్మానం



తెలుగు గళం న్యూస్ హనుమకొండ

తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన రాజు చౌహాన్‌ను గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు.శనివారం నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో రాజు చౌహాన్‌కు గిరిజన సంప్రదాయ బద్ధంగా తలపాగా తొడిగి,గజమాల,శాలువాలతో పాటు జ్ఞాపికను అందజేసి ప్రత్యేకంగా సన్మానించారు.విద్యుత్ శాఖలో ఆయన అందించిన విశిష్ట సేవలను,ఉద్యోగుల పట్ల చూపిన ఆత్మీయతను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందా రాథోడ్,కంపెనీ గౌరవ అధ్యక్షుడు వాలు నాయక్,కంపెనీ ప్రెసిడెంట్ హర్జీ నాయక్,కంపెనీ జనరల్ సెక్రటరీ అజ్మీరా శ్రీరామ్ నాయక్,చీఫ్ అడ్వైజర్ సామ్య నాయక్,వరంగల్,హనుమకొండ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు,విద్యుత్ సిబ్బంది,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేయాలి"

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్"



సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు 01 (తెలుగుగళం) న్యూస్ :

ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందేలా సత్తుపల్లి కేంద్రంగా వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.శనివారం సత్తుపల్లిలోని సంఘ భవనంలో సంఘ అధ్యక్షుడు కేశవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో కార్యదర్శి ప్రకాశరావు వార్షిక నివేదికను ఆర్థిక కార్యదర్శి జి. కృష్ణయ్య ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు.

అనంతరం జరిగిన చర్చలో పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఒక వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లా కేంద్రం ఖమ్మం సత్తుపల్లికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. సత్తుపల్లి ఉప ఖజానా కార్యాలయ పరిధిలో వేలాది మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నందున అందరికీ సౌకర్యంగా ఉండేలా సత్తుపల్లిలోనే వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

హెల్త్ కార్డులపై అయోమయం

ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనకరమైన ఆరోగ్య పథకం అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండానే జూన్ నెల నుంచి వేతనాలు, పెన్షన్లలో 1.5 శాతం కోత విధిస్తున్నారని, మూడు నెలలు గడిచినా చికిత్స అందించే ఆసుపత్రుల విషయంలో స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆరోగ్య కార్డులపై చికిత్స అందించే ఆసుపత్రుల జాబితా విడుదల చేసినప్పటికీ, అందులోని అనేక ఆసుపత్రులు ఆరోగ్య కార్డులను అంగీకరించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డులనే అందించలేని పరిస్థితి నెలకొనడం విచారకరమన్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి సమావేశాలు జరుగుతున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కుటుంబ పెన్షనర్లు మాట్లాడుతూ తమకు వచ్చే పెన్షన్ స్వల్పంగా ఉండగా, అందులోనూ 1.5 శాతం కోత విధించడం వల్ల ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. కుటుంబ పెన్షనర్లకు ఉచిత వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

డీఏలు, పీఆర్సీ వెంటనే అమలు చేయాలి. ఉద్యోగులు, పెన్షనర్లకు రావలసిన ఆరు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను తక్షణమే స్వీకరించి అమలు ఉత్తర్వులు జారీ చేయాలని కోరింది. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమ బాట పట్టక తప్పదని సమావేశంలో తీర్మానం చేశారు.

ఈ సమావేశంలో: రామిశెట్టి సుబ్బారావు, అద్దంకి వెంకటరత్నం, ఎన్. నర్సయ్య, జి. కృష్ణయ్య, యోగానంద్, మహమూద్, కమలకుమారి, వాణి, సాంబశివరెడ్డి, బూరుగు దాసు, సుందరరావు, మధుసూదనరాజు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి జేవీఆర్ ఓసీలో సీఐటీయూ గేట్ మీటింగ్"

## బేసిక్ నష్టపోయిన జనరల్ అసిస్టెంట్లకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం:మందా నరసింహారావు (సీఐటీయూ రాష్ట్ర నేత)

సత్తుపల్లి, ఆర్ సి,ఆగస్టు 01(తెలుగుగళం) న్యూస్: సింగరేణి జేవీఆర్ ఓసీలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్ విజయవంతంగా జరిగింది.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర నాయకులు మందా నరసింహారావు మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు వచ్చిన జనరల్ అసిస్టెంట్లకు బేసిక్ వేతనంలో జరిగిన నష్టాన్ని సరిదిద్దేందుకు సీఐటీయూ హైకోర్టులో ఐదేళ్ల పాటు సుదీర్ఘ న్యాయపోరాటం చేసి చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని తెలిపారు.

బేసిక్ నష్టపోయిన జనరల్ అసిస్టెంట్లు, ఇతర హోదాల్లో పనిచేస్తున్న బాధిత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సత్తుపల్లిలోని సీఐటీయూ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ అంశంపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు పిట్ మీటింగ్‌లు, సాధారణ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కార్మికులు తమ దరఖాస్తులను సీఐటీయూ కార్యాలయంలో సమర్పించాలని, మిగిలిన బేసిక్ నష్టపోయిన వారందరికీ కూడా న్యాయం జరిగేలా కోర్టు ద్వారా పోరాటం కొనసాగిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

ఈ గేట్ మీటింగ్‌లో: సీఐటీయూ జిల్లా నాయకుడు సర్వేశ్వరరావు, ఏరియా అధ్యక్షుడు గాదె సంపత్, బ్రాంచ్ కార్యదర్శి ముత్యాల కార్తీక్, విజయగిరి శ్రీనివాస్, లక్ష్మణ్, వై.వి.రావు, మంగరాజు, శంకర్ తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# సింగరేణి జి ఎం కార్యాలయం ఎదుట ఐ ఎన్టియుసి ధర్నా"

## మణుగూరు డిప్ సైడ్ బొగ్గు సింగరేణికి కేటాయించాలని ఐఎన్టీయూసీ ధర్నా"
## జి.ఎంకు వినతిపత్రం ఇచ్చిన ఐఎన్టీయూసీ నేతలు"




సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు01(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి లోని సింగరేణి జి.ఎం కార్యాలయం ముందు ఐఎన్టియుసి నేతలు తీగల క్రాంతి కుమార్,బి కోటేశ్వరరావు ల ఆధ్వర్యంలో సత్తుపల్లి ఏరియాలోని జే.వి.ఆర్ ఓసి , కిష్టారం ఓసి,జే.వి.ఆర్ సి.హెచ్.పి , జె.వి.ఆర్ డిస్పెన్సరీ కార్మికులు మహాధర్నా చేశారు. ఈ సందర్భంగా తీగల మాట్లాడుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ కొరకు కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ

ఆగస్టు 4 నుండి 11 వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బొగ్గు బ్లాక్ ల వేలంలో మణుగూరు డిప్ సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణి సంస్థకు కేటాయించాలని ధర్నా చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర నేతలైన జనక్ ప్రసాద్,రజాక్ ల ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు.అనంతరం ఐఎన్టీయూసీ నాయకులు బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారంగా ఉండే సింగరేణి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా ఉందన్నారు.సింగరేణి సంస్థ 137 సంవత్సరాల అనుభవం కలిగి అధునాతన టెక్నాలజీతో బొగ్గు ఉత్పత్తి సాధిస్తుశీ దన్నారు. సింగరేణి సంస్థకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాక్ లను కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకే కేటాయించాలని,తాడిచర్ల (2) బొగ్గు బ్లాక్ పూర్తిగా సింగరేణి సంస్థ ద్వారా మాత్రమే నడిపిస్తే స్థానిక నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.





కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాక్ ల వేలంలో పాల్గొని కోయగూడెం బ్లాక్ , సత్తుపల్లి ఓసి 3 బ్లాక్ ప్రైవేట్ పారిశ్రామిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అలాట్మెంట్ చేయడం జరిగింది. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇలాంటి మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభం కానందున సింగరేణి సంస్థ అనుభవం , సాంకేతిక సామర్థ్యం పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సింగరేణి సంస్థకు కేటాయించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో: ఐఎన్టియుసి నాయకులు బ్రాంచ్ సెక్రటరీ లు నాగ ప్రకాష్ , మురళికృష్ణ ,బ్రాంచ్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షరీక్ బాబు , అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ పొట్టి కిరణ్ , ట్రెజరర్ సుదర్శన్ , ఆర్గనైజర్ సెక్రెటరీ నజీర్, యశ్వంత్ రెడ్డి, వేణునాథ్, పిట్ సెక్రెటరీ లు సీతారామరాజు , షణ్ముఖ చారి , నాగేష్ , నాగేశ్వరావు ముఖ్య నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు , డి.ఎల్.ఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

